సాక్షి రంగారెడ్డి

గురువారం । 19 । డిసెంబర్ । 2024



సంక్షేమానికి కృషి చేయాలి

సఫాయి కర్మచారుల సంక్షేమానికి కృషి చేయాలని సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశన్ అన్నారు. 8లో▸



బిల్లులు ఇప్పించండి

సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు ఇప్పించాలని సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. 8లో▸



ప్రజల సహకారం అవసరం

పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని షాద్‌నగర్ ఏసీపీ సీహెచ్ రంగస్వామి సూచించారు. 8లో▸

న్యూస్‌రీల్

పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి



మండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

షాద్‌నగర్: పెండింగ్‌లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి అన్నారు. బుధవారం జరిగిన శాసన మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా అయిన పాలమూరులో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే సాగు, తాగునీటి సమస్య తీరుతుందని తెలిపారు. గత ప్రభుత్వం చేపట్టిన పాలమూరు ఎత్తిపోతల పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో సరిగా నిధులు కేటాయించలేదని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న రిజర్వాయర్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. షాద్‌నగర్ పరిధిలోని మొగిలిగిద్దను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖలో 510 జీఓ ద్వారా నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. పాఠశాలల సమయానికి అనుగుణంగా బస్సులు నడిపించాలని, విద్యార్థులకు తగిన సదుపాయాలు కల్పించాలని కోరారు.

'దేవుడు ఉన్నాడు జాగ్రత్త' పుస్తకం అందజేత



సౌందరరాజన్‌కు పుస్తకాన్ని అందజేస్తున్న రచయిత ఎంవీఆర్ శాస్త్రి

మొయినాబాద్: 'దేవుడు ఉన్నాడు జాగ్రత్త' పుస్తకాన్ని రాసిన రచయిత ఎంవీఆర్ శాస్త్రి మొదటి పుస్తకాన్ని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు సౌందరరాజన్‌కు అందజేశారు. చిలుకూరు బాలాజీ దేవాలయానికి బుధవారం చేరుకుని పుస్తకాన్ని బాలాజీ పాదాల వద్ద ఉంచారు. అనంతరం సౌందరరాజన్‌కు మొదటి పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంవీఆర్ శాస్త్రి మాట్లాడుతూ.. దేవాలయాల పరిరక్షణకోసం ఉద్యమాన్ని నడిపిన సౌందరరాజనే ఈ పుస్తకాన్ని రచించడానికి స్ఫూర్తి అని అన్నారు. అందుకే ఆయనకు మొదటి పుస్తకాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, అర్చకుడు రంగరాజన్ తదితరులు ఉన్నారు.

వంటా వార్పుతో నిరసన




కలెక్టరేట్ ఎదుట భోజనాలు చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం రూరల్: సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన రిలే దీక్షలు బుధవారం 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. అక్కడే వంట చేసి భోజనాలు చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త

నందిగామ: సైబర్ నేరాలతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఏ మాత్రం అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని శంషాబాద్ డీసీపీ రాజేష్ అన్నారు. మండల పరిధిలోని మొదళ్లగూడ శివారులోని సింబయాసిస్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు సైబర్ క్రైం గురించి బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు ఎక్కడో ఒకచోట సైబర్ క్రైం గురించి, మోసాల గురించి వింటున్నామని అన్నారు. అలాంటి సైబర్ కేటుగాళ్ల నుంచి జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. గుర్తుతెలియని నంబర్లతో వచ్చే ఫోన్ కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని, ఓటీపీలు చెప్పొద్దని సూచించారు. ఓఎల్ఎక్స్, ఉద్యోగాలు ఇప్పిస్తామని, కస్టమర్ కేర్ నుంచి, ఫేక్ యాప్స్, డిజిటల్ అరెస్ట్, న్యూడ్ కాల్స్, మ్యాట్రిమోని నుంచి స్పామ్ బ్యాంకుల నుంచి వచ్చే ఫోన్‌లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒకవేళ మోసపోయినట్లు తెలిస్తే వెంటనే 100 నంబర్‌కు గానీ లేదా 1930కు గానీ కాల్ చేసి చెప్పాలని వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్ రావు, నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల మండలం ఆలూరులో చలి మంటలు కాచుకుంటూ..



చేవెళ్లలో పేపర్ సెట్ చేసుకుంటున్న పేపర్ బాయ్‌లు



చేవెళ్లలోని కూరగాయల మార్కెట్‌లో..



చేవెళ్ల బస్‌స్టేషన్‌లో బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ

చలించని శ్రమజీవులు

రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు

- పంజా విసురుతున్న చలిపులి
- గజగజ వణుకుతూనే రోజు వారీ విధుల్లో ఆయా వర్గాలు
- కుటుంబాల కోసం జీవన పయనం



రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి.. చలి పంజా విసురుతోంది.. గజగజ వణికిస్తోంది.. తీవ్రత అంతకంతకూ పెరుగుతోంది.. ఉదయం 8 నుంచి 9 గంటలు దాటినా మంచు ముసుగు తొలగడం లేదు.. దుప్పటి వీడడం లేదు.. అంతటి ఎముకలు కొరికే చలిలోనూ ఆయా వర్గాల ప్రజలు తమ జీవన పోరాటం కొనసాగిస్తున్నారు.. మంకీక్యాపులు, స్వెట్టర్లు, దుప్పట్లు కప్పుకొని రోజువారీ విధులు మునిగితేలారు.. చేవెళ్లలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 'సాక్షి' విజిట్ చేయగా ఎవరికి వారు వణికే చలిలో తమ పనులు చేసుకుంటూ కనిపించారు.

– చేవెళ్ల

మార్కెట్లలో ఇలా..

- చేవెళ్ల మార్కెట్‌లో నిత్యం కూరగాయలు తీసుకు వచ్చే రైతులు, కొనుగోలు చేసేందుకు వచ్చే చిరువ్యాపారులు, వీళ్లను తీసుకు వచ్చేందుకు వచ్చే ఆటో డ్రైవర్లు ఉదయం 5 గంటల నుంచే తమ ప్రయాణం మొదలు పెడుతూ కనిపించారు. మార్కెట్ ఉదయం 5.30 నుంచి 8 గంటలలోపు పూర్తవుతుంది. దీంతో ముందుగా సరుకు తీసుకు రావాలని రైతులు, త్వరగా కొనాలనే చిరువ్యాపారులు చలిని లెక్క చేయకుండా ఉదయాన్నే మార్కెట్‌లో కనిపించారు.
- రైతులు చలికి స్వెట్టర్లు వేసుకుని.. దుప్పట్లు కప్పుకొని గ్రామాల నుంచి.. పొలాల నుంచి బయలుదేరారు. కూరగాయలను ద్విచక్రవాహనాలు, ఆటోల్లో తీసుకుని ఆయా మార్కెట్లకు వచ్చారు. పూల రైతులు రాత్రిళ్లు, తెల్లవారుజామునే కోసేందుకు వెళ్లి ఉదయాన్నే మార్కెట్లకు తరలించేందుకు నానా పాట్లు పడుతున్నారు.

ఉపాధి వేళ..

- పంచాయతీ కార్మికులు వీధులు శుభ్రం చేస్తూ రోజు వారీ విధుల్లో నిమగ్నమయ్యారు.
- వలస కూలీలు టిఫిన్ బాక్స్‌లు పట్టుకుని పనుల కోసం ఉదయాన్నే అడ్డాలపై సిద్ధంగా ఉన్నారు.
- చాయ్ అమ్ముకునేందుకు చలిలో వచ్చిన చిరు వ్యాపారులు, చాయ్ దుకాణాల వద్ద చలికి వణుకుతూ గరంగరం చాయి తాగుతూ ఉపశమనం పొందే వారు కనిపించారు.

ప్రయాణం అలా..

- నిత్యం ఉదయాన్నే బస్సులు సమయానికి తీసుకువచ్చే ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లు, బస్సుల్లో ప్రయాణాలు చేసే వివిధ ఉపాధి, ఉద్యోగాలకు వెళ్లే వారు మాస్కులు, స్వెట్టర్లు వేసుకొని ప్రయాణం సాగించారు.



స్వెట్టర్లు, మఫ్లర్లతో బస్సులో కండక్టర్, ప్రయాణికుల ప్రయాణం

వణికిస్తున్న చలికి జనం కాలు బయటపెట్టేందుకే జంకుతుండగా కార్మికులు, కర్షకులు, చిరువ్యాపారులు, కూలీలు, ఇలా అనేక రంగాల్లో పని చేసే వారు తమ నిత్య జీవన ప్రయాణాన్ని సాగిస్తున్నారు. పొట్ట కూటికోసం కొందరు బయలుదేరితే.. వృత్తి, ఉద్యోగ బాధ్యతల నిమిత్తం మరికొందరూ చలితో సావాసం చేస్తూ ముందుకు సాగుతున్నారు. నిత్యం పనిచేసే పేపర్ బాయ్‌లు, బస్సు డ్రైవర్లు, చాయ్ హోటళ్లు, కార్మికులు, ఆటో డ్రైవర్లు, ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం ప్రయాణం చేసే వారు, రైతులు, చిరువ్యాపారులు ఇలా ఆయా వర్గాలకు చెందిన వారు 'చలి'ంచకుండా తమ పనుల్లో నిమగ్నమయ్యారు.



చేవెళ్లలోని కూరగాయల మార్కెట్‌లో రైతులు, చిరువ్యాపారులు

చలికి ఉక్కిరిబిక్కిరి

వణికించే చలితో జిల్లావాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆది, సోమ, మంగళ వారల్లో కనిష్ఠంగా 6.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం కాస్త పెరిగి కనిష్ఠంగా చౌదరిగూడెంలో 9.9, షాబాద్ చందనవెల్లిలో 10.1, రాజేంద్రనగర్‌లో 10.7, శేరిలింగంపల్లిలో 11.1, కొందుర్గులో 11.2, షాబాద్ తాళ్లపల్లిలో 11.3, ఇబ్రహీంపట్నంలో 11.6, బాలాపూర్‌లో 11.6, తలకొండపల్లిలో 12, మహేశ్వరంలో 12, చేవెళ్ల కందవాడ, కేశంపేటలో 12.1, మొయినాబాద్‌లో 12.3 డిగ్రీలుగా నమోదయ్యాయి.



చలికి నిండా గొంగళి కప్పుకొని వెళ్తున్న వృద్ధుడు

మార్కెట్ ఉదయమే ఉంటుంది



పొలంలో పండించిన పంటలను అమ్ముకోవాలంటే ఉదయం మార్కెట్‌కు రావాల్సిందే. చలి ఉందని కూర్చుంటే మార్కెట్ అయిపోతుంది. ఉదయమే వ్యాపారులు ఉంటారు. ధరలు వస్తాయి. అందుకే ఉదయాన్నే సంచులను బండిపై పెట్టుకొని చలిలోనే ఇలా వచ్చాను. మంచుతో రోడ్డు కూడా సరిగా కనిపించడం లేదు. కానీ జీవన పోరాటం తప్పదు.

– వెంకటయ్య, రైతు

వేడివేడి టీ.. ఇదే ఉపాధి



బతుకుదెరువు కోసమే చాయ్ బండి పెట్టుకున్నా. గిరాకీ ఉన్నప్పుడు అమ్ముకోవాలి. ఉదయం, రాత్రి సమయంలో బాగా చలి వేస్తోంది. చలికి చాయ్ తాగే గిరాకీ ఉంటుంది. అందుకే ఉదయాన్నే టీస్టాల్ ఓపెన్ చేసి పెట్టుకుంటా. రెండుమూడురోజుల నుంచి విపరీతమైన చలి ఉంది. రెగ్యులర్‌గా ఉదయం రైతులు, చిరువ్యాపారులు వస్తుంటారు.

– సంతు, హోటల్ నిర్వాహకుడు

ఆరోగ్యం కోసం వాకింగ్



చలి తీవ్రత ఎక్కువగా ఉంది. బయటకు రావాలంటేనే భయంగా ఉంది.. ఆరోగ్యం కోసం నడక తప్పదు. అందుకే చలి వణికిస్తున్నా స్వెటర్, క్యాప్ పెట్టుకుని ఇలా వాకింగ్‌కు వచ్చా. ప్రతి రోజు తప్పకుండా వాకింగ్ చేయడం అలవాటు. చలి ఎక్కువగా ఉన్నా గరంగరం చాయ్ తాగి అలా నాలుగు అడుగులు వేసి వెళ్తున్నాను.

– నర్సింలు, వాకర్, చేవెళ్ల

ఇబ్బందిగా ఉన్నా తప్పదు



తెల్లవారుజామునే పేపర్ పార్సల్ వస్తుంది. చలికాలం కాస్త కష్టం తప్పదు. ఎవరూ రాక ముందే బస్‌స్టేషన్‌కు రావాల్సి ఉంటుంది. లేదంటే పేపర్లు ఎవరైనా తీసుకెళ్తే కస్టమర్లకు ఇబ్బంది అవుతుంది. ఉదయం లేచే సరికి ఇళ్లలో పేపర్ ఉండాలంటే త్వరగా రావాల్సిందే. చలితో ఇబ్బందిగా ఉన్నా తప్పటం లేదు.

– యాదయ్య, పేపర్ బాయ్

న్యూ ఇయర్ వేడుకలపై నజర్

రాచకొండ సీపీ సుధీర్ బాబు

సాక్షి, సిటీబ్యూరో: నూతన సంవత్సర వేడుకలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు, పార్టీలు, ఈవెంట్లలో మాదక ద్రవ్యాల వినియోగంపై నిఘా పెట్టేందుకు స్నిఫర్ డాగ్స్‌ను రంగంలోకి దింపనున్నట్లు రాచకొండ పోలీసు కమిషనర్ జి.సుధీర్ బాబు తెలిపారు. ఈ నెల 31 రాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ రహదారులపై నిఘా పెట్టేందుకు ప్రత్యేకంగా నైట్ సూపర్‌విజింగ్ ఆఫీసర్లు (ఎన్‌ఎస్‌ఓ)ను నియమించినట్లు చెప్పారు. ముఖ్యమైన, సున్నితమైన ప్రాంతాలలో ట్రాఫిక్ జాంలు, రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా అదనపు బందోబస్త్‌తో పాటు ఈవ్ టీజర్లను పట్టుకునేందుకు షీ టీమ్స్ రంగంలోకి దింపనున్నట్లు పేర్కొన్నారు. ముందస్తు అనుమతి లేకుండా పార్టీలు, ఈవెంట్లను చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

నేటి నుంచి పుస్తక ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న పుస్తక ప్రదర్శన అధ్యక్షుడు యాకూబ్

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్న నిర్వాహకులు

కవాడిగూడ: హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఆధ్వర్యంలో 37వ జాతీయ పుస్తక ప్రదర్శన గురువారం సాయంత్రం ఎన్టీఆర్ స్టేడియంలో ప్రారంభం కానుంది. ఈ నెల 29 వరకు ఇది కొనసాగనుంది. బుధవారం హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్, కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ విలేకరులతో ఇక్కడ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 210 మందికి పైగా ప్రచురణకర్తలు, డిస్ట్రిబ్యూటర్లు పుస్తకాలను ప్రదర్శించనున్నారని తెలిపారు. ప్రతి ఇంటిలో పుస్తకం ఉండే లక్ష్యంగా బుక్ ఫెయిర్‌ను ముందుకు తీసుకువెళ్తామన్నారు. 36 ఏళ్ల క్రితం 30 స్టాళ్లతో ప్రారంభమైన పుస్తక ప్రదర్శన ప్రస్తుతం 350 స్టాళ్లతో సాహితీ అభిమానులను, పుస్తక ప్రేమికులను ఆకట్టుకోనుందని తెలిపారు. బాల సాహిత్యానికి ప్రాధాన్యమిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్రవేశం ఉచితం..

పుస్తక ప్రదర్శనలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు వారి ఐడీ కార్డులు చూపించి ఉచిత ప్రవేశం పొందవచ్చని తెలిపారు.

ఉచిత ఆరోగ్య శిబిరం..నోరూరించే వంటకం..

తెలంగాణ రుచులతో ప్రత్యేక ఫుడ్‌స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుక్‌ఫెయిర్ సందర్శకుల కోసం ఈ ఏడాది ఉచిత ఆరోగ్య శిబిరంతో పాటు రెండు వీల్ చైర్లను అందుబాటులో ఉంచుతామన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలు..

ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. సమావేశంలో తెలుగు భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బుక్‌ఫెయిర్ ఉపాధ్యక్షులు శోభన్‌బాబు, బాల్‌రెడ్డి, ట్రెజరర్ నారాయణరెడ్డి, జాయింట్ సెక్రటరీ సూరిబాబు, కె.సురేష్ పాల్గొన్నారు.

గురుకులంలో క్రీడా సంబురం

- నేటి నుంచి 10వ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్
- హాజరుకానున్న 1,200 మంది విద్యార్థినులు
- కమ్మదనం గురుకుల పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థల ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా షాద్‌నగర్ పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాలలో గురువారం నుంచి 10వ రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్ జరగనుంది. గత నెలలో రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలను 20 జోన్లుగా విభజించి జోనల్ స్థాయి క్రీడలు నిర్వహించారు. వీటిల్లో గెలుపొందిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి జోనల్ పోటీలను షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాల ఆవరణలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

క్రీడా విభాగాలు ఇవే..

పోటీల్లో వివిధ గురుకుల పాఠశాలలకు చెందిన 1,200 మంది విద్యార్థినులు పాల్గొననున్నారు. అండర్- 14, -17, -19 విభాగాల్లో వాలీబాల్, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, క్యారం, టెన్నికాయిట్, అథ్లెటిక్స్‌లో పోటీలు ఉంటాయి.

ఏర్పాట్ల పరిశీలన

రాష్ట్రస్థాయి క్రీడల నిర్వహణకు పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కమిటీలను ఏర్పాటు చేసి ఇన్‌చార్జిలను నియమించారు. బుధవారం గురుకుల పాఠశాలల మల్టీజోనల్ ఆఫీసర్ రజిని, జోనల్ ఆఫీసర్లు నిర్మల, ఫ్లొరెన్స్ ఏర్పాట్లను పరిశీలించారు.

అన్ని సౌకర్యాలు



రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మూడు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో 1,200 మంది విద్యార్థినులు పాల్గొంటున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– విద్యుల్లత , ప్రిన్సిపాల్, కమ్మదనం గురుకుల పాఠశాల

వ్యాక్సిన్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ షబా

షాద్‌నగర్: చిన్నారులు, గర్భిణులకు ఇచ్చే వ్యాక్సినేషన్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ షబా ఆరోగ్య సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిఫ్రిజిరేటర్‌లో అన్ని రకాల వ్యాక్సిన్‌లు క్రమపద్ధతిలో ఉంచారా లేదా అని పరిశీలించారు. రికార్డులతో పాటు, వ్యాక్సిన్ స్టాక్ ఎంత ఉందో పరిశీలించారు. ప్రతి రోజు వ్యాక్సిన్ వేయించుకోవడానికి ఎంత మంది వస్తున్నారని స్టాఫ్ నర్సులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ షబా మాట్లాడుతూ.. వ్యాక్సినేషన్ కోసం పీపీ యూనిట్‌కు వచ్చే చిన్నారులు, గర్భిణులకు విధిగా వ్యాక్సిన్ వేసి పంపించాలని అన్నారు. వ్యాక్సినేషన్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పేషెంట్ల ఇమ్యూనైజేషన్ కార్డుల్లో అన్ని వివరాలు విధిగా నమోదు చేయాలన్నారు. వ్యాక్సినేషన్ కొరత లేదని, సరిపడా వ్యాక్సిన్ లేకుంటే వెంటనే ఇండెంట్ పంపించి వ్యాక్సిన్‌ను జిల్లా కేంద్రం నుంచి తెప్పించుకోవాలన్నారు. పేదల ఆరోగ్య సంక్షేమానికి అందరు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. డాక్టర్ షబా వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ సువర్ణ తదితరులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వెళ్లిపోయిన వ్యక్తి

యాచారం: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లి పోయాడు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని మాల్ గ్రామానికి చెందిన కోపరాతి వెంకటరమణ(45) వెల్డింగ్ వృత్తి చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో కొన్ని నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. వెల్డింగ్ దుకాణం నుంచి మంగళవారం ఉదయం వెళ్లి పోయాడు. 24 గంటలు గడిచినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు బుధవారం యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

యాచారం: ఆటో ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైనాయి. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన సొల్లేటి నాగరాజు బుధవారం సాయంత్రం తన బైక్‌పై స్వగ్రామం నుంచి యాచారానికి వస్తున్నాడు. గ్రామ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్‌పై ఉన్న నాగరాజుతో పాటు ఆమె బంధువైన ఐలమ్మకు తీవ్ర గాయాలైనాయి. అంబులెన్స్‌లో నగరంలోని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

బెట్టింగ్‌కు మరిగి.. అప్పులు చేసి

ఆత్మహత్య చేసుకున్న యువకుడు


శివలింగం (ఫైల్)

ఇబ్రహీంపట్నం: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి.. అప్పుల పాలైన యువకుడు ఆత్మహత్యయత్నం చేసుకొని చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. తులేకలాన్ గ్రామానికి చెందిన చెనమోని శివలింగం(28) ఓ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. కొంత కాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పులు చేశాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతుండటంతో మనస్తాపానికి గురైన శివలింగం ఈ నెల 15న ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మంటలను ఆర్పి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



వరి.. కాపాడుకోవాలి మరి

కందుకూరు: రాత్రి ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే తగ్గితే వరి నారు ఎదుగుదలలో లోపంతో పిలకలు వేయకపోవడం, ఆకు అంచులు పసుపు రంగులోకి మారి చనిపోతాయి. చలి, మంచు తీవ్రతకు నారును కాపాడుకోవడానికి నారు మడి చుట్టూ ఇనుప చువ్వలు, లేదా వెదురు బొంగులు నాటి రాత్రి వేళ పాలిథిన్ షీట్ లేదా పట్టాలు కప్పి ఉదయం తీసేయాలి. నారు మడిలో సాయంత్రం నీరు పెట్టుకుని మళ్లీ ఉదయం తీసివేసి కొత్త నీరు పెట్టుకోవాలి. నారు ఎదుగుదలకు 19-19-19 లేదా 13-0-45 ఎరువు 10 గ్రాములు లీటరు నీటికి స్ప్రే చేయించుకోవాలి. జింక్ లోపం నివారణకు 2 గ్రా. జింక్‌సల్ఫేట్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

– సుధారాణి, ఏడీఏ, మహేశ్వరం



యూట్యూబర్స్ @ జైల్!

సినీ నటితో అసభ్యంగా ప్రవర్తించిన నేరంలో ఒకరు

- ఓఆర్ఆర్‌పై అభ్యంతరకరంగా వ్యవహరించి మరొకరు
- ఒకే రోజు చోటుచేసుకున్న ఇద్దరు నిందితుల అరెస్టులు


ప్రసాద్ బెహరా




భానుచందర్

బంజారాహిల్స్/ఘట్‌కేసర్: హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని జూబ్లీహిల్స్ పోలీసులు... రాచకొండ కమిషనరేట్‌లోని ఘట్‌కేసర్ అధికారులు.. బుధవారం ఇద్దరు యూట్యూబర్స్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు. వీరిలో ఒకరు సినీ నటితో అసభ్యంగా ప్రవర్తించి కటకటాల్లోకి చేరగా... మరొకరు ఔటర్ రింగ్ రోడ్‌పై (ఓఆర్ఆర్) న్యూసెన్స్ క్రియేట్ చేసి ఊచలు లెక్కపెడుతున్నాడు. ఇతడి అరెస్టు ద్వారా పోలీసులు రీల్స్, మీమ్స్ పేరుతో ఓవర్ చేస్తే ఊరుకునేది లేదని స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు.

మారానంటూ మళ్లీ మొదటికి...

మణికొండ పంచవటి కాలనీలో నివసించే సినీ నటికి ఏడాదిన్నరగా యూట్యూబర్ ప్రసాద్ బెహరాతో పరిచయం ఉంది. ఇతడు యూట్యూబ్, కొన్ని చిత్రాల ద్వారా ప్రాచుర్యం పొందాడు. సదరు నటి 'పెళ్లివారమండీ' వెబ్ సిరీస్‌లో ప్రసాద్‌తో జత కట్టారు. షూటింగ్ సమయంలో ప్రసాద్ ప్రవర్తన, డబుల్ మీనింగ్ డైలాగ్స్ తట్టుకోలేక వెబ్ సిరీస్ నుంచి ఆమె తప్పుకున్నారు. ఆపై ఆమెకు పలు మార్లు ఫోన్ చేసిన ప్రసాద్ క్షమాపణలు చెప్పాడు. నిజమని నమ్మిన ఆమె ఏడాది తర్వాత మెకానిక్ అనే వెబ్ సిరీస్‌లో హీరోయిన్‌గా నటిస్తోంది. తన ప్రవర్తన మార్చుకోని అతగాడు అసభ్యంగా మాట్లాడటం, తాకడం చేశాడు. ఆమె అడ్డు చెప్పగా... షూటింగ్స్‌లో ఇవన్నీ సహజమని, కాదంటే నీకే నష్టమని హెచ్చరించాడు. అతడి ప్రవర్తన, మాటలు, చేష్టలతో విసిగిపోయిన పోలీసులకు ఫిర్యాదు చేస్తానంటే.. దుర్భాషలాడాడు. దీంతో ఆమె జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించగా... ప్రసాద్‌పై బీఎన్ఎస్‌లోని 75 (2), 79, 351 (2) సెక్షన్ల కింద కేసు నమోదైంది. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

కట్ట విసిరి కట్టలు సంపాదించాలని...

మనీ హంట్ చాలెంజ్ పేరుతో ఓఆర్ఆర్‌పై ఓ నోట్ల కట్ట విసిరి, ఆ రీల్‌ను సోషల్ మీడియాలో పెట్టి, సబ్‌స్క్రైబర్లను పెంచుకోవడం ద్వారా యూట్యూబ్ నుంచి భారీ ఆదాయం పొందాలని ప్రయత్నించిన మరో యూట్యూబర్ రాయలపురం భానుచందర్ జైలుకు వెళ్లాడు. బాలానగర్‌కు చెందిన ఇతగాడు ఐదు రోజుల క్రితం ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ 9 సమీపంలో ఓ రీల్ చేశాడు. రూ.20 వేల కట్టను చెట్ల పొదల్లో పడేసి ఎవరైనా వచ్చి తీసుకోవచ్చంటూ దాన్ని తన సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేశాడు. ఇది వైరల్ కావడంతో ఓఆర్ఆర్ పెట్రోలింగ్ సిబ్బంది సీరియస్‌గా తీసుకున్నారు. ఇలా చేయడం న్యూసెన్స్ కిందికి వస్తుందని, ప్రయాణికులకు ముప్పు వాటిల్లేలా ప్రవర్తించడమే అని ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇతడిపై బీఎన్ఎస్‌లోని 125, 272, ఐటీ యాక్ట్‌లోని 66 సీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేయడంతో పాటు అతడి దగ్గర ఉన్న ఐ ఫోన్ 13 ప్రో సీజ్ చేశారు. ఓఆర్ఆర్, జాతీయ రహదారులపై రీల్స్ చేస్తే ప్రాణాలకు హాని జరిగే ప్రమాదం ఉందని, ఇలా చేస్తే జైలుకు పంపుతామని మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి హెచ్చరించారు.

నేటి నుంచి ఇసామే ఫోరం సమావేశాలు

15 ఏళ్ల తర్వాత హైదరాబాద్‌లో నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు 52వ ఇసామే (ఇండియా, సౌత్ ఏషియా, మిడిల్ ఈస్ట్) ఫోరం సమావేశాలు జరగనున్నాయి. 15 సంవత్సరాల తర్వాత తొలిసారిగా హైదరాబాద్‌లో ఈ సమావేశాలు జరగనుండటం విశేషం. కాగా, ప్రపంచంలోనే అతి పెద్ద సర్వీసెస్ క్లబ్ ఆర్గనైజేషన్‌గా లయన్స్ ఇంటర్నేషనల్ అవతరించిందని క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఫాబ్రిసియో ఒలివేరా పేర్కొన్నారు. స్థానిక హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..200 దేశాల్లో 49 వేల క్లబ్‌లు ఉన్నాయని తెలిపారు. మొత్తం 1.4 మిలియన్ సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు. 1917లో లయన్స్ క్లబ్ స్థాపించిన నాటి నుంచి అవసరమున్న చోట్ల నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రపంచంలో అత్యంత జనాదరణ పొందిన క్లబ్‌గా గుర్తింపు తెచ్చుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబూరావు మాట్లాడుతూ..తెలుగు రాష్ట్రాల నుంచి గత నాలుగేళ్లలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్‌కు సుమారు రూ.100 కోట్ల విరాళాలు వచ్చాయని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా మేమున్నామని ముందుకొస్తుంది. మూడు రోజుల పాటు క్లబ్ పనితీరును గుర్తుచేసుకోవడం, భవిష్యత్తు అంశాలను చర్చించుకుంటామన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ముఖ్యం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీసీపీ శ్రీనివాస్ తదితరులు

రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

మొయినాబాద్‌రూరల్: దేశవ్యాప్తంగా జరుగుతన్న సైబర్ మోసాలపై ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకొని జాగ్రత్తగా ఉండాలని రాజేంద్రనగర్ డీసీపీ సి.హెచ్.శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా మోసగాళ్లు డిజిటల్ ద్వారా అనేక నేరాలు చేస్తున్నారని సూచించారు. అలాంటి మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని తమకు డబ్బులు వేయాలనే కాల్స్‌కు దూరంగా ఉండాలన్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏసీపీ బి.కిషన్, డివిజన్ డీఐ రమేష్, విద్యాజ్యోతి కళాశాల డీన్ పద్మజ, ఏఓ వెంకటాచలం, సైబర్ క్రైమ్ పోలీసులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించండి

శాసనమండలి ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేత

కడ్తాల్: రాష్ట్రంలో సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే ప్రభుత్వం నుంచి విడుదల చేయించాలని సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్సీలు కవిత, నవీన్‌రెడ్డిలతో కలిసి శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 2019–2024 కాల వ్యవధిలో సర్పంచ్‌లుగా కొనసాగి ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలాభివృద్ధికి కృషి చేశామన్నారు. పెండింగ్ బిల్లులు రాక రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వెంటనే బిల్లులు విడుదల చేసే విధంగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు.


ఎమ్మెల్సీలు కవిత, నవీన్‌రెడ్డిలతో కలిసి వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

ప్రజల సహకారం అవసరం


ఆమనగల్లు: మాట్లాడుతున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి

ఆమనగల్లు: పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని షాద్‌నగర్ ఏసీపీ సీహెచ్ రంగస్వామి సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆమనగల్లు పట్టణంలోని పోలీసు సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం ఏసీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ కార్యాలయంలో ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న వివిధ కేసుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. సీఐ ప్రమోద్‌కుమార్, సిబ్బందికి ఏసీపీ పలు సూచనలు చేశారు. అనంతరం ఏసీపీ రంగస్వామి మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్‌రూరల్: మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి బెల్టు దుకాణాల్లో మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని పట్టణ సీఐ విజయకుమార్ హెచ్చరించారు. షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన 47 ఎక్సైజ్ కేసులకు సంబంధించిన మద్యం సీసాలను బుధవారం పట్టణ సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ విజయకుమార్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలోని బెల్టు దుకాణాలలో మద్యం విక్రయించరాదని అన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా కొందరు కిరాణం షాపులు, చిన్నచిన్న హోటల్స్‌లో మద్యం విక్రయిస్తున్నారని అన్నారు. వారిపై చట్టపరంగా కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారుల సంక్షేమానికి కృషి చేయాలి

సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ ఛైర్మన్ వెంకటేశన్

ఇబ్రహీంపట్నం రూరల్: సఫాయి కర్మచారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేసి.. వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలని సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేశన్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సఫాయి కర్మాచారుల కోసం జిల్లా యంత్రాంగం అమలు చేస్తున్న పథకాల పురోగతిపై అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశన్ మాట్లాడుతూ.. సఫాయి కర్మచారులకు పునరావాసం కల్పించడంలో ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో సఫాయి కర్మచారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీల్లో పని చేస్తున్న సఫాయి కర్మచారులకు వేతన స్లిప్, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా అందిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్లు తెలిపారు. సఫాయి కర్మచారులు అపరిశుభ్రమైన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయన్నారు. వీరు నివసించే ప్రాంతాల్లో ఏడాదికి రెండుసార్లు తప్పకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపాధి కల్పనకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లలో కర్మచారులను నియమించి, కనీస వేతనాలు అందించాలని చెప్పారు. మహిళా కార్మికుల కోసం ప్రత్యేక కమిటీ వేసి, వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి రామారావు, ఎస్సీ కార్పొరేషన్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, మైనార్టీ శాఖ అధికారి నవీన్‌రెడ్డి, గిరిజన సంక్షేమ అధికారి రామేశ్వరిదేవి, వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.


సఫాయి కర్మచారులతో మాట్లాడుతున్న వెంకటేశన్

అంబులెన్స్‌లో ప్రసవం

కేశంపేట: అంబులెన్స్‌లో ఓ గర్భిణీ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన సంఘటన మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన మౌనిక పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది ఆమెను కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా వేములనర్వ గ్రామ శివారులో నొప్పులు అధికమయ్యాయి. వెంటనే అంబులెన్స్‌ను ఆపి కుటుంబ సభ్యుల సహకారంతో ఈఆర్‌సీపీ డాక్టర్ మనిష్, ఈఎంటీ సాయికృష్ణ, పైలెట్ దీపక్ ఆమెకు సుఖ ప్రసవం చేశారు. మౌనిక పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


శిశువును కుటుంబ సభ్యులకు అందిస్తున్న 108 సిబ్బంది

ఎదురెదురుగా కారు-బైక్ ఢీ

ఇద్దరు రైతులకు తీవ్ర గాయాలు

చేవెళ్ల: ఎదురెదురుగా వస్తున్న కారు-బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శంకర్‌పల్లి మండల పరిధిలోని హెసెన్‌పూర్ చౌరస్తా సమీపంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలంలోని తంగడపల్లి అనుబంధ గ్రామమైన మడికట్టుకు చెందిన రైతులు హన్మంత్ రెడ్డి, పోచయ్య బైక్‌పై పెళ్లికి వెళ్లి వస్తున్నారు. మార్గమధ్యలో వీరిని తంగడపల్లి వద్ద ఎదురుగా వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హన్మంత్ రెడ్డి, పోచయ్యలకు తీవ్ర గాయలయ్యారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను శంకర్‌పల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేయటంలో పోలీసులు ఆలస్యం చేశాయని క్షతగాత్రుల కుటుంబసభ్యులు ఆరోపించారు. మరోపక్క ఘటనాస్థలం పరిధి మాది కాదంటే మాది కాదని శంకర్‌పల్లి, చేవెళ్ల పోలీసులు అనటంతో బాధితులు గందరగోళంలో పడ్డారు. చివరికి చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి పోలీస్ అధికారని తెలిసిందని సమాచారం. ప్రమాద సమయంలో కారులో వ్యక్తులు అక్కడి నుంచి జారుకున్నారని స్థానికులు చెప్పారు.

కేటీఆర్‌ను కలిసిన ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



కడ్తాల్: బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కడ్తాల్ మండలంలోని ముద్విన్ గ్రామంలోని ఇళ్లు లేని నిరుపేదలకి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్మించిన ఇంటిని ప్రారంభించేందుకు రావాలని కేటీఆర్‌ను ఆహ్వానించినట్లు దశరథ్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

గొడవ వద్దన్నందుకు బీరు సీసాతో వ్యక్తిపై దాడి

మీర్‌పేట: గొడవ పడొద్దన్నందుకు వైన్‌షాపు సూపర్‌వైజర్‌పై మద్యం మత్తులో ఉన్న యువకుడు బీరు సీసాతో దాడి చేసిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. అల్మాస్‌గూడ రాజీవ్ గృహకల్పకు చెందిన తండ్రీకొడుకులు అడ్డాకుల విజయ్, కార్తీక్ (25)లు బుధవారం రాత్రి బడంగ్‌పేటలోని ఎస్‌వీడీ వైన్స్‌కు వచ్చి మద్యం తాగారు. అనంతరం ఇద్దరు గొడవ పడుతుండగా సూపర్‌వైజర్ శ్రీనివాస్ ఇక్కడ ఘర్షణ పడొద్దన్నాడు. మత్తులో ఉన్న కార్తీక్ బీరు సీసాను పగులగొట్టి శ్రీనివాస్ ఛాతిపై పొడిచాడు. రక్తస్రావం కావడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ భార్య మంజుల ఫిర్యాదు మేరకు కార్తీక్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్‌లో గడ్డి దగ్ధం

నందిగామ: పశుగ్రాసం(వరి గడ్డి) లోడుతో వెళ్తున్న ట్రాక్టరుకు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైన ఘటన మండల పరిధిలోని రంగాపూర్ శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. రంగాపూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన సర్వేంద్రిగూడకు చెందిన పాశం భిక్షపతి కేశంపేట మండలం అల్వాల్‌లో రూ.30 వేలు వెచ్చించి వరి గడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో స్వగ్రామానికి తీసుకొస్తున్నాడు. మార్గమధ్యలో గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద విద్యుత్ తీగలు ట్రాక్టరులోని గడ్డి మోపులకు తగిలి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు గమనించి కేకలు వేయగా.. డ్రైవర్ ట్రాక్టర్ ట్రాలీని పైకి లేపడంతో గడ్డి మోపులు కిందపడి పోయాయి. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఐదు నిమిషాల వ్యవధిలో తమ పశువుల పాక వద్దకు ట్రాక్టరు చేరుకునే అవకాశం ఉండగా.. అంతలోనే ప్రమాదం చోటు చేసుకోవడంతో రైతు భిక్షపతి కన్నీరుమున్నీరుగా విలపించాడు.


దగ్ధమవుతున్న ట్రాక్టర్‌లోని పశుగ్రాసం